సాక్షి నంద్యాల

సోమవారం : 25 : ఆగస్టు : 2025



'పల్లె'వించిన కట్టుబాటు

తుగ్గలి మండలంలోని హుసేనాపురం, ఆర్. కొట్టాల గ్రామాల్లోకి ఎవరూ మద్యం బాటిళ్లు, సారా తీసుకు రావడం లేదు. ఆ కట్టుబాటు ఇప్పటికీ ఆనవాయి తీగా కొనసాగుతోంది. 8లో▸



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: నిత్యకళా వేదికపై ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన కూచిపూడి కళాక్షేత్రం వారి సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.69
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.770
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:36,014
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:17,952

న్యూస్‌రీల్

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

నంద్యాల: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా హెచ్చరించారు. ఆదివారం జిల్లా పరిధిలోని నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు, సబ్ పరిధిలో కార్డెన్ సెర్చ్ పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు ప్రతి ప్రాంతంలో పోలీసులు, ప్రజల మధ్య ఫ్రెండ్లీ పోలీసింగ్ పెంపొందించడం జరుగుతుందన్నారు. అసాంఘిక కార్యకపాలాలను అదుపు చేయడానికి, నేరాల నియంత్రణలో భాగంగా ఆదివారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా పది పోలీసు స్టేషన్ల పరిధిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్, ఆత్మకూరు సబ్ డివిజన్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 70 వాహనాలు, 50 మద్యం సీసాలు, 20 లీటర్ల నాటుసారాతో పాటు 200 లీటర్ల బెల్లం ఊటాను ధ్వంసం చేశామన్నారు. అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు లేదా 112, 100 నంబరుకు డయల్ చేయాలన్నారు.

సరిహద్దుల మార్పులకు 29 నుంచి వినతుల స్వీకరణ

నంద్యాల: జిల్లా, మండల, గ్రామాల పేర్లు, వాటి సరిహద్దుల మార్పుల కోసం ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఈనెల 29వ తేదీన రాష్ట్ర మంత్రుల బృందం విజ్ఞప్తులను స్వీకరిస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలు సునయన ఆడిటోరియంలో ఈనెల 29న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మంత్రులు నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ యాదవ్ ప్రజల నుంచి వినతులు, సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. ప్రజల సమస్యలు, సూచనలు అధ్యయనం చేసి సమగ్రంగా పరిశీలించి జిల్లా, మండల గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పు కోసం వాటిని పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. నంద్యాల జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోవెలకుంట్ల మండలం జోళదరాశి వద్ద కుందూనదిపై రిజర్వాయర్ ఏర్పాటు కావాల్సిన ప్రదేశం (ఫైల్)



పరిహారం రాక.. పరివాహకం లేక!

- కలగా మిగిలిన కుందూనదిపై రిజర్వాయర్ల ఏర్పాటు
- రూ. 1,357 కోట్లు కేటాయించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జోళదరాశి, రాజోలి వద్ద రిజర్వాయర్ల ఏర్పాటుకు భూసేకరణ పూర్తి
- అవార్డుపాసైనా రైతులకందని నష్టపరిహారం
- రిజర్వాయర్లకు కేటాయించిన భూములు బ్లాక్
- ఆన్‌లైన్‌లో కన్పించని భూముల వివరాలు
- నష్టరిహారం రాక, భూములు అమ్ముకోలేక రైతన్న గగ్గోలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

వరద నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి కుందూను జీవనది చేయాలన్నది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యం. ఇందుకోసం రిజర్వాయర్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపి నిధులు కేటాయించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రెండు జిల్లాల ప్రజలకు రిజర్వాయర్ల ఏర్పాటు కలగా మిగిలిపోయింది.



జోళదరాశి, రాజోలి రిజర్వాయర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కోవెలకుంట్ల: ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల ప్రజలకు శాశ్వత తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలన్న ఉద్దేశంతో కుందూనదిపై జోళదరాశి, రాజోలి నిర్మించాలని 2008 డిసెంబర్‌లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కోవెలకుంట్ల మండలం జోళదరాశి వద్ద 0.8 టీఎంసీ, చాగలమర్రి మండలం రాజోలి వద్ద 2.95 టీఎంసీల సామర్థ్యంతో నదిపై రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణానికి అప్పట్లోనే రూ. 407 కోట్లు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులిచ్చారు. వైఎస్సార్ జిల్లాలో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు, కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ, కర్నూలు జిల్లాలో కుందూనది పరివాహక ప్రాంతాల్లోని 100 గ్రామాల ప్రజలకు తాగు నీరు, 60 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే 2009 సెప్టెంబర్ నెలలో వైఎస్సార్ అకాల మరణం, తదనంతరం చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా తర్వాత అధికారంలోకి వచ్చిన కిరణ్ సర్కార్ పట్టించుకోలేదు. తెలుగుదేశం ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినా.. రిజర్వాయర్ల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడం రెండు జిల్లాల రైతులకు శాపంగా మారింది.

రైతులకు అందని నష్టపరిహారం

రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు అప్పటి ప్రభుత్వం అవార్డు పాస్ చేసి రెండేళ్ల క్రితమే ధర నిర్ణయించింది. భూములు కోల్పోయే రైతులకు కొన్ని చోట్ల ఎకరాకు రూ. 14.50 లక్షలు, మరికొన్ని చోట్ల రూ. 16 లక్షలు నష్టపరిహారం అందించాల్సి ఉంది. ఈ మేరకు రైతులకు సంబంధించిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. రైతులకు నష్టపరిహారం అందేలోపే 2024 సార్వత్రిక ఎన్నికలు రావడం, ఆ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రిజర్వాయర్ల నిర్మాణానికి బ్రేక్ పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రిజర్వాయర్ల ఏర్పాటు అగమ్యగోచరంగా మారింది. రైతులకు నష్టపరిహారం అందకపోగా పట్టా భూములను బ్లాక్ చేయడంతో ఆన్‌లైన్‌లో ఆ భూముల వివరాలు కన్పించడంలేదు. ఆ భూములపై పంట రుణాలు తీసుకుందామనుకున్నా ఆన్‌లైన్‌లో లేకపోవడంతో బ్యాంకుల ద్వారా రైతులకు రుణాలు అందటంలేదు. పిల్లల వివాహాలు, ఇతర శుభకార్యాల నిమిత్తం చేతిలో డబ్బులు లేని రైతులు పొలాన్ని అమ్ముకుందామనుకున్నా రిజిస్టర్ కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపరిహారం అందే వరకు పొలాల్లో పంట సాగు చేసుకుందామనుకున్నా నెల రోజుల నుంచి కుందూనదికి భారీగా వరద నీటిని విడుదల చేయడంతో ఆ పొలాలను వరదనీరు ముంచెత్తుతోంది. రిజర్వాయర్ల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించి రెండు చోట్ల రిజర్వాయర్లను ఏర్పాటు చేసి రెండు జిల్లాల ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

2.25 ఎకరాల భూమిని కోల్పోయాను



కోవెలకుంట్ల మండలం జోళదరాశి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి 2.25 ఎకరాల భూమిని కోల్పోయాను. ఎకరాకు రూ. 16 లక్షల చొప్పున నష్ట పరిహారం అందజేస్తామన్నారు. రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు అందలేదు. పొలం పేరున బ్యాంకులో పంట రుణం తీసుకుందామనుకున్నా ఆన్‌లైన్‌లో వివరాలు లేకపోవడంతో పంట రుణం ఇవ్వడం లేదు.

– వెంకటసుబ్బయ్య, రైతు, చింతకుంట, కోవెలకుంట్ల మండలం

పొలం అమ్ముకునేందుకు వీలు లేకుండా పోయింది



రిజర్వాయర్ నిర్మాణానికి ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవడంతో ఆన్‌లైన్‌లో భూవివరాలు బ్లాక్ అయ్యాయి. జోళదరాశి రిజర్వాయర్ నిర్మాణంలో రెండు ఎకరాల భూమిని కోల్పోయాను. ఇప్పటి వరకు నష్ట పరిహారం అందలేదు. డబ్బుల అవసర నిమిత్తం భూమిని అమ్ముకుందామనుకున్నా భూముల వివరాలు లేకపోవడంతో రిజిస్టర్ కావడంలేదు. అధికారులు న్యాయం చేసి నష్ట పరిహారం అందించాలి.

– సుబ్బరాయుడు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

రిజర్వాయర్ల ఏర్పాటుకు గత సర్కార్ శ్రీకారం

కుందూనదిపై రిజర్వాయర్లు ఏర్పాటు కాకపోవడంతో రెండు జిల్లాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించారు. 2017 నవంబర్ నెలలో వైఎస్ జగన్ పాదయాత్ర కోవెలకుంట్లకు చేరుకోగా కుందూపోరాట సమితి నాయకులు, నదీతీర ప్రాంత ప్రజలు రిజర్వాయర్ల ఆవశ్యకతను వైఎస్ జగన్ దృష్టికి తెచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రెండుచోట్ల రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తామని అప్పట్లో రైతులకు వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుందూనదిపై రిజర్వాయర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అదే ఏడాది డిసెంబర్ నెలలో వైఎస్సార్ జిల్లా దువ్వూరు సమీపంలోని నేలటూరు వద్ద రాజోలి, జోళదరాశి రిజర్వాయర్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. చాగలమర్రి మండలం రాజోలి వద్ద 2.95 టీఎంసీలు, కోవెలకుంట్ల మండలం జోళదరాశి వద్ద 0.8 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణానికి రూ. 1357.10కోట్లు కేటాయించారు. జోళదరాశి సమీపంలో 2,100 ఎకరాల్లో రిజర్వాయర్ నిర్మాణానికి భూములు గుర్తించారు. మండలంలోని బిజనవేముల సమీపంలో మారుతీనగర్‌కు సంబంధించిన 1,700 ఎకరాల బంజరుభూమి, జోళదరాశి, కలుగొట్ల, రేవనూరు, ఉప్పలూరు, వెలగటూరు, చింతకుంట, చిన్నకొప్పెర్ల, ఎం.గోవిందిన్నె, లింగాల, వల్లంపాడు గ్రామాల పరిధిలో 400 ఎకరాల పట్టా భూములు రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమవుతాయని సర్వే చేసి రిజర్వాయర్ ఏర్పాటుపై గత ప్రభుత్వం దృష్టి సారించింది.

శ్రీశైలం.. భక్తజన సంద్రం



క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా మల్లన్న స్పర్శదర్శనాన్ని నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కిటకిటలాడాయి.

బెలుం గుహల సందర్శనకు అంతరాయం

- పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన బురద

కొలిమిగుండ్ల: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలను అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరదనీరు ప్రవహించడంతో లోపల పలు భాగాల్లో బురద పేరుకుపోయింది. గుహలోపల పర్యాటకులను ప్రధానంగా ఆకట్టుకునే పాతాళగంగ, కోటిలింగాలు తదితర ప్రాంతాలకు పోయేందుకు వీలు లేకుండా పోయింది. ఎక్కువ భాగం బురద నిల్వ ఉండటంతో ఆప్రాంతాలను వీక్షించేందుకు యాత్రికులకు అవకాశం లేకుండా పోయింది. బురద ఉన్న చోట సిబ్బంది అక్కడక్కడ బండరాళ్లు ఏర్పాటు చేసినా ఇబ్బందిగా మారుతోంది. వివిధ రాష్ట్రాల ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు గుహ లోపల ముఖ్యమైన ప్రాంతాలు తిలకించే అవకాశం లేకుండా పోవడంతో నిరుత్సాహ పడుతున్నారు. శని, ఆదివారాల్లో ఎక్కువ మంది వస్తుంటారు. పూర్తి స్థాయిలో బురద అంతా ఆరిపోయేందుకు వారం రోజులు పైగానే సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నీటి తొట్టికి టీడీపీ రంగు



పసుపు రంగు

తుగ్గలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పలుచోట్ల ఆ పార్టీ శ్రేణులు ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలకు పచ్చరంగు వేసి తమ వికృత చేష్టలను బయటపెట్టుకున్నారు. దాన్ని అనుసరించి తుగ్గలి మండలం రామకొండలో ఉపాధి హామీ నిధులు రూ.38వేలతో నిర్మించిన పశువుల నీటి తొట్టికి సైతం పసుపు రంగు వేశారు. దీనిని చూసి టీడీపీ నాయకులు మురిసి పోతుండగా..ప్రజలు మాత్రం విస్తుపోతున్నారు.

ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు



ఎల్లెల్సీలో పూజలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణ మాస ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆలయ డిప్యూటీ కమిషనర్ వాణి ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు వెళ్లి గంగా పూజ నిర్వహించి హారతిని వదిలారు. దేవాలయ అర్చకులు ఈరప్పస్వామి, మహదేవస్వామి, వేద పండితుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఎమ్మిగనూరులో 20 , గోనెగండ్లలో 12.6, గూడూరులో 6.6, కోడుమూరులో 5.8,, పెద్దకడుబూరులో 4.6, కౌతాళంలో 4 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అనుమతి.. అవిఘ్నమస్తు!

- 27 నుంచి వినాయక చవితి వేడుకలు ప్రారంభం
- జిల్లాలో దాదాపు 1200 విగ్రహాలు ఏర్పాటుకు సన్నాహాలు
- మండపాలకు సింగిల్ విండో అనుమతులు
- మండపాల వద్ద డీజే సౌండ్‌లు వినియోగిస్తే చర్యలు



మండపాన్ని అలంకరిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): గణపతి నవరాత్రోత్సవాలు సమీపిస్తుండటంతో అంతటా సందడి మొదలైంది. ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేష్ చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు వాడవాడలా మండపాల నిర్వాహకులు ఆయా పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే నిర్వాహక కమిటీలు భారీ వినాయక విగ్రహాలకు, లైటింగ్, డెకరేషన్, సాంస్కృతిక కార్యక్రమాలకు ఆర్డర్లు ఇచ్చారు. జిల్లా పరిధిలో సుమారు 1,200కు పైగా వినాయక మండపాలు ఏర్పాటు కానున్నట్లు అంచనా. నంద్యాలలో 500, ఆళ్లగడ్డ 120, బనగానపల్లెలో 100, కోవెలకుంట్ల 110, డోన్ 100, ఆత్మకూరు 120, నందికొట్కూరు 150కి పైగానే ఏర్పాటు కానున్నాయి. నంద్యాల పట్టణంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వినాయక ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈ సారి భారీ ఎత్తున ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. కాగా ఉత్సవాల్లో ముందస్తు జాగ్రత్తగా పోలీసు శాఖ https://ganeshutsav.net ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. వినాయక మండపాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో నవరాత్రుల ప్రారంభోత్సవం నుంచి శోభాయాత్ర, నిమజ్జనం వరకు తదితర అంశాలను చాలా సులువుగా చేపట్టవచ్చని పోలీస్ శాఖ భావిస్తోంది. ప్రతి విగ్రహానికి క్యూఆర్ కోడ్ ఇవ్వనుంది. పోలీస్ శాఖ అనుమతులతో పాటు పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక శాఖల అనుమతుల వివరాలు పోర్టల్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.

నిబంధనలు పాటించాలి



ఇప్పటికే వినాయక ఉత్సవ నిర్వాహకులతో ఏరియా వారీగా సమావేశాలు ఏర్పాటు చేశాం. పోలీసు మార్గదర్శకాలు, అనుమతులు గురించి వివరిస్తాం. వినాయక విగ్రహాల ఏర్పాటుకుగా గణేష్ ఉత్సవ్.నెట్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సింగిల్ విండో అనుమతులు ఇవ్వనున్నాం. పెద్ద డీజేల ద్వారా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలి. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కమిటీ సభ్యులపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలు అతిక్రమిస్తే నిర్వహణ కమిటీ సభ్యులే బాధ్యత.

– అధిరాజ్‌సింగ్ రాణా, జిల్లా ఎస్పీ, నంద్యాల


అనుమతులు.. పాటించాల్సిన నిబంధనలు..

- ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలు పోలీసులకు ఇవ్వాలి. ఏదీ జరిగినా తామే బాధ్యులమంటూ మండప నిర్వాహకులు లెటర్ ఇవ్వాలి.
- మండపానికి క్యూఆర్ కోడ్ తీసుకోవాలి. డీఎస్పీ ద్వారా మెక్, విగ్రహ ఊరేగింపు అనుమతి పొందాలి.
- విగ్రహాల ఎత్తు 10 అడుగులకు మించకూడదు.
- విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు. నిమజ్జనం చేసే తేదీ, సమయం. నిమజ్జనం చేసే ప్రాంతం తెలియజేయాలి.
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకోవాలి.
- సాధారణ ప్రజల రవాణాకు అడ్డంగా, రోడ్లుపైన, వివాదస్పదమైన ప్రదేశాల్లో విగ్రహాలను ఏర్పాటు చేయకూడదు.
- నిమజ్జనం ఊరేగింపుల్లో ఏవిధమైన అభ్యంతకర అశ్లీల నృత్యాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకూడదు.



- శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలి.
- విద్యా సంస్థలు, ఆసుపత్రులకు వంద మీటర్ల దూరంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసుకోవాలి.
- ఉదయం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నియమిత పరిమితిలో సౌండ్ బాక్సు ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి 10 గంటల తర్వాత ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకూడదు.

డీఎస్సీలో అంతా హైడ్రామా!



కర్నూలు సిటీ: ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో డీఎస్సీల నోటిఫికేషన్ల ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మోగా పేరుతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి హైడ్రామా నడిచింది. డీఎస్సీ పరీక్షలు నెల రోజుల పాటు నిర్వహించిన తరువాత నార్మలైజేషన్ చేయడంతో చాలా తప్పులు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. అయితే ఆ తప్పులు సరిదిద్దేందుకు సమయం పడుతుండడంతోనే తుది సెలక్షన్ జాబితాల విడుదలలో జాప్యం జరుగుతోందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారి వివరాలు ఇవ్వలేదు. ఎంపికైన వారికి లెటర్లు కూడా పంపించలేదు. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారికి సోమవారం సర్టిఫికెట్లు పరిశీలన చేస్తామని తొలుత చెప్పి తరువాత వాయిదా వేశారు. అంతా హైడ్రామా నడుస్తుడటంతో డీఎస్సీలో మంచి మార్కులు, ర్యాంకులు తెచ్చుకున్న వారు ఆందోళన చెందుతున్నారు.

ఇవీ అనుమానాలు...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే అనాడు టీడీపీ పెద్దలు ఒక మాట అన్నారు. డీఎస్సీ ప్రిపరేషన్‌కు కనీసం 90 రోజులు ఉండాలని చెప్పారు. అధికారంలోకి వచ్చాక డీఎస్సీ ప్రిపరేషన్‌కు 90 రోజుల సమయం లేకుండానే నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నెల రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించారు.

- పరీక్షలు ముగిసిన తరువాత విడుదల చేసిన కీపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. అభ్యంతరాలను తీసుకొని తుది కీ ఇచ్చారు. ఇందులోనూ అనేక తప్పులు ఉన్నాయని అభ్యర్థుల నుంచి ఆందోళనలు వచ్చాయి. దీంతో అభ్యంతరాలను స్వీకరించారు కానీ పరిష్కరించారో లేదో అర్థం కానీ పరిస్థితులు ఉన్నాయి.
- పాఠశాల విద్య శాఖ కమిషనర్ విజయరామరాజు గతంలో ఎప్పుడూ లేని విధంగా డీఎస్సీ పరీక్షలు రాసిన వారందరి మార్కులను, ర్యాంకులను ఇవ్వకుండానే ఒక్కో పోస్టుకు ఒక అభ్యర్థిని ఎంపిక చేసి సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయాలని హడావుడిగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. దీనిపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. జడ్జి ఆదేశాల మేరకు మెరిట్ లిస్టులు జారీ చేశారు.
- ఉద్యోగాలకు ఎంపికైన వారిని ఖరారు చేసి జాబితాలు ఇవ్వడంతో అదిగో...ఇదిగో అంటూ రెండు రోజులు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటనలు జారీ చేస్తున్నారు. ఇంత వరకు ఎలాంటి జాబితాలు ఇవ్వక పోవడంతో అభ్యర్థులు మరింత ఆందోళన చెందతున్నారు.

స్పష్టత కరువు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,645 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో తెలంగాణలోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్, మేడ్చల్, ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, మాన్యం, పార్వతీపురం, విజయనగరం, నెల్లూరు, గుంటూరు జిల్లాలకు చెందిన వారు నాన్‌లోకల్‌లో దరఖాస్తు చేశారు. వారు అత్యధిక మార్కులు సాధించారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎంత మంది దరఖాస్తు చేశారు? ఏఏ క్యాటగిరీకి ఎన్ని దరఖాస్తులు వచ్చాయో కూడా ఇంత వరకు విద్యాశాఖ దగ్గర వివరాలు లేవు. ఇదేంటని అడిగిన వారికి రాష్ట్ర స్థాయి నుంచి ఆదేశం వచ్చిందని చెబుతున్నారు. ఇప్పటి వరకు వివరాలను ప్రకటించకపోవడంతో అనేక అనుమానాలు కలుగుతున్నాయి. బీసీ–డీ, బీసీ–ఈ క్యాటగిరీలకు, అన్ని క్యాటగిరీ పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు, చేసిన దరఖాస్తులకు, పరీక్షల తరువాత ప్రకటించిన మెరిట్ జాబితాల్లోని సంఖ్యకు తేడాలు ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారులు డీఎస్సీ కన్వీనర్ దృష్టికి తీసుకపోగా..అలాంటిదేమి లేదని, పబ్లిసిటీ కోసమే అని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

బస్సు డ్రైవర్‌పై దాడి

కొలిమిగుండ్ల: తిమ్మనాయునిపేట జంక్షన్ వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. జమ్మలమడుగు డిపోకు చెందిన అద్దె బస్సు తాడిపత్రికి బయలు దేరింది. తిమ్మనాయునిపేట జంక్షన్‌లో ప్రయాణికులను దింపుతుండగా అదే సమయంలో నందిపాడుకు చెందిన మధు పంట కోతకుకు చెందిన హార్వెస్టర్ పోయేందుకు వెనక్కి పోవాలని బస్సు డ్రైవర్‌ను కోరాడు. ప్రయాణికులు దిగగానే వెళ్తానని చెపుతుండగానే ఒక్క సారిగా మధు బస్సు డ్రైవర్ కాలేబుపై దాడికి పాల్పడ్డాడు. ప్రయాణికులతో సహా బస్సును కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. జరిగిన ఘటనపై డ్రైవర్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

నెమలి వేటగాళ్ల అరెస్ట్



వేటగాళ్లను అరెస్ట్ చేసిన దృశ్యం

బేతంచెర్ల: పట్టణానికి సమీపంలో జాతీయ రహదారిపై ముగ్గురు నెమలి వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. ఆదివారం వారు తెలిపిన వివరాల మేరకు.. పాణ్యం మండలం కొణిదేడు గ్రామానికి చెందిన సీ. రామ్‌మోహన్ రెడ్డి, బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన బుక్కాపురం మద్దిలేటి, మధుచరణ్ బైక్‌పై శనివారం రాత్రి హెచ్ కొట్టాల పరిసర ప్రాంతంలో నెమలిని వేటాడారు. అనంతరం నెమలిని చంపి ఈకలు పీకేసుకొని ఆదివారం తెల్లవారుజామున బేతంచెర్ల వైపు బైక్‌పై వస్తుండగా నైట్ బీట్‌లో ఉన్న పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు. వారి వద్ద ఈకలు పీకేసిన నెమలి లభ్యం కావడంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అనిల్ కుమార్, ఫారెస్టు గార్డ్ రఘు రాముడుకు అప్పగించారు.

అడవి పంది కూర పట్టివేత

వెలుగోడు: అడవి పంది కూరను వెలుగోడు రేంజ్ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు ..ఆదివారం వెలుగోడు రేంజర్ తాహీర్, ఎఫ్ఎస్‌వో గోపినాథ్, ఎఫ్‌బీవో వెంకటేశ్వర్లు, మయూరి, ప్రొటెక్షన్ వాచర్లు కొత్త రామాపురం గ్రామంలోని పలు ఇళ్లలో రెండు బందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. అడవి పందిని వేటాడి మాంసాన్ని వండి తినేందుకు సిద్ధంగా ఉండటంతో కూరను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన జయన్న, తిరుమలేశ్, శివమ్మబాయిపై వైల్డ్‌లైఫ్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు రేంజర్ తాహీర్ తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.


జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం నంద్యాల జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు శ్రీనివాస యాదవ్ పర్యవేక్షణలో ఆదివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఈ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కిరణ్‌కుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, ట్రెజరర్‌గా గోవిందరాజు, రాష్ట్ర సభ్యులుగా అబ్రహాం, మహబూబ్‌బాషా, శివనాగేంద్రుడు, జిల్లా ఉపాధ్యక్షులుగా రామ్మోహన్‌రెడ్డి, రామనరసప్ప, రఫీఅహమ్మద్, సహాయ కార్యదర్శులుగా వెంకటరమణ, భాస్కరరెడ్డి, వెంకటస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రమణారెడ్డి, రాజేంద్రప్రసాద్, గౌరవాధ్యక్షులుగా నంద్యాల డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్, డోన్ డిప్యూటీ డీఈఓ వెంకటరామిరెడ్డి, మహిళా సెక్రటరీలుగా అలివేలమ్మ, నాగలక్ష్మి, మల్లేశ్వరిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. రెండేళ్లపాటు ఈ కమిటీ ఉంటుందన్నారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుల సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు.

పల్లెవించిన కట్టుబాటు



హుసేనాపురం గ్రామం వ్యూ

- మజరా గ్రామాలు.. మద్యం, సారాకు దూరం
- హుసేనాపురంలో 20 ఏళ్లు, ఆర్ కొట్టాలలో 15 ఏళ్లుగా మద్యం విక్రయాలు బంద్
- ప్రశాంతంగా జీవనం గడుపుతున్నామంటున్న గ్రామస్తులు

కూటమి ప్రభుత్వ విధానాలతో ఇప్పుడు నీరు దొరకని ఊరు ఉందేమో కాని మద్యం లభించని పల్లెలు ఉన్నాయా అంటే .. ఆ రెండు పల్లెలను మినహాయించాల్సిందే. ప్రస్తుతం ఏ ఊరు చూసినా బెల్టు షాపులతో కళకళలాడుతున్నాయి. అవసరమైతే క్షణాల్లో డోర్ డెలివరి చేసే పరిస్థితి వచ్చింది. కానీ ఆ రెండు పల్లెలు ఇప్పటికీ కట్టుబాట్లను పాటిస్తూ మద్యానికి దూరంగా ఉంటున్నాయి. ఆ పల్లెల్లో మద్యం మాటే లేదు. ఎవరికైనా మద్యం తాగే అలవాటు ఉన్నా పక్క ఊరికి వెళ్లాల్సిందే.

– తుగ్గలి

పట్టణాల నుంచి పల్లెల వరకు ఊర్లల్లో ఏ పండగైనా.. పెళ్లైనా.. చావైనా.. కార్యక్రమం ఏదైనా సరే.. ముందు మందు బాటిల్ ఓపెన్ కావాల్సిందే. కానీ ఇప్పటికీ ఆ పల్లెలు అందుకు ఆమడ దూరంలో ఉంటున్నాయి. మద్యం విషయంలో ఓ కట్టుబాటు విధించుకున్నాయి. ఈ విషయంలో అక్కడి జనం రాజకీయ పార్టీల కతీతంగా వ్యవహరిస్తారు. ఎవరైనా మద్యం అమ్మినా, తాగినా వెంటనే వారిపై పోలీసులకు సమాచారం ఇస్తారు. దీంతో ఆ గ్రామాల్లో మద్యం విక్రయాలు లేవు. ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మండలంలోని హుసేనాపురంలో 20 ఏళ్లు, ఆర్ కొట్టాలలో 15 ఏళ్లుగా మద్యం నిషేధాన్ని అమలు చేస్తున్నారు. హుసేనాపురంలో ఐదు ఇళ్లు, ఆర్ కొట్టాలలో ఒక ఇళ్లు మినహా మిగిలిన ఇళ్లన్నీ ముస్లిం మైనార్టీ కుటుంబాలే. అంతకు ముందు ఆ గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరిగేవి. సారా, మద్యం తాగి తరచూ గొడవలు పడుతుండే వారు. ఆ సమయంలో గ్రామ పెద్దలంతా మాట్లాడుకుని గ్రామాల్లో ఎవరూ మద్యం అమ్మకూడదు, తాగకూడదని కట్టుబాటు ఏర్పాటు చేసుకున్నారు. ఆ కట్టుబాటు ఇప్పటికీ ఆనవాయితీగా కొనసాగుతోంది. ప్రస్తుతం యువత కూడా పెద్దల కట్టుబాటును కొనసాగిస్తూ.. వారి అడుగుజాడల్లో నడుస్తున్నారు. హుసేనాపురంలో 153 కుటుంబాలు, 729 మంది జనాభా, ఆర్ కొట్టాలలో 139 కుటుంబాలు, 779 మంది జనాభా ఉన్నారు. ప్రభుత్వాలు మారినా గ్రామ కట్టుబాటు మాత్రం మారకుండా పెద్దలు కాపాడుకుంటూ వస్తున్నారు. గ్రామంలోకి ఎవరూ మద్యం బాటిళ్లు, సారా తీసుకురావడం లేదు. ఎవరైనా ఒకరిద్దరికి మద్యం తాగే అలవాటు ఉంటే అలాంటి వారు పక్క గ్రామాలకు వెళ్లి తాగాల్సిందే తప్ప గ్రామాల్లోకి మాత్రం మద్యం అనుమతించరు.

ప్రశాంతంగా జీవనం..

ఈ గ్రామాల్లో అన్నీ రైతు కుటుంబాలే. ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి వస్తుంటారు. ఈ గ్రామాల్లో మద్యపాన నిషేధం ఉండటంతో మద్యం ప్రియులు కూడా మద్యం మానేసి ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. దీంతో గొడవ లేకుండా ప్రశాంతంగా జీవనం గడుపుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి




యువత, పిల్లల భవిష్యత్ కోసం గ్రామస్తులంతా ఏకమై మద్యపాన నిషేధం అమలు చేశారు. అంతా వ్యవసాయ పనులు చేసుకుంటూ ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారు. గ్రామాభివృద్ధి కోసం కట్టుబాటు చేసిన మద్య నిషేధం అమలు నేటికీ కొనసాగుతోంది. ఐకమత్యంతో గ్రామంలో కోటి రూపాయలకు పైగా ఖర్చుచేసి మజీద్ నిర్మించుకున్నాం. మద్యపాన నిషేధంతో ఆరోగ్యంగా కూడా ఉంటున్నాం. నిత్యం మజీద్ వెళ్లి ప్రార్థనలు చేసుకుంటూ ప్రశాంత జీవనం గడుపుతున్నాం. ఇలాంటి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కూడా ప్రోత్సాహకాలు అందించాల్సి అవసరం ఉంది.

– లద్దు కమాల్‌బాషా, సర్పంచ్, ఆర్ కొట్టాల



ఆర్ కొట్టాల గ్రామం

20 ఏళ్ల క్రితం సమష్టి తీర్మానం



20 ఏళ్ల క్రితం గ్రామంలో సారా అమ్మకాలు జరిగేవి. సారా తాగి చిన్నచిన్న గొడవలతో మనస్పర్థలు వచ్చేవి. అందరం అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండాలని పెద్దలందరితో కలిసి ఊర్లో ఎవరూ సారా, మద్యం అమ్మ కూడదని తీర్మానించుకున్నాం. అప్పటి నుంచి ఊర్లో మద్యపాన నిషేధం కొనసాగు తోంది. నాతో పాటు చాలా మంది జమాతే తీ సుకుని రోజూ ఐదు పూటలా మజీద్‌లో నమాజ్ చేసుకుంటూ ఆధాత్మికంగా ప్రశాంతంగా గడుపుతున్నాం.

– సయ్యద్ బొజ్జులు, హుసేనాపురం

మద్యపానానికి దూరం



పెద్దలు తీర్మానించినప్పటి నుంచి ఊర్లో మద్యం అమ్మకాలు లేవు. వ్యవసాయ పనులు చేసుకోవడం, మజీద్‌కు వెళ్లడం వంటి తప్ప మద్యం జోలికి మాత్రం ఎవరూ వెళ్లరు. ఏ సమస్య వచ్చినా పెద్దలంతా మాట్లాడుకుని పరిష్కరించుకుంటాం. ఊర్లో కట్టుబాటు ఒకటి, మద్యం అమ్మినా, తాగినా పోలీసులకు చెబుతారని ఎవరూ మద్యం జోలికి వెళ్లడం లేదు. ఎవరైనా ఒకరిద్దరికి అలావాటు ఉన్నా వారు గుట్టుచప్పుడు కాకుండా బయట తాగాల్సిందే తప్ప ఊర్లోకి అనుమతించం.

– యూనస్, మజీద్ నిర్వాహకులు, హుసేనాపురం

ఆ స్థలం మాజీ సైనికుల ఆసుపత్రికి ఇచ్చిందే!

కర్నూలు(అర్బన్): నగరంలోని బీ క్యాంప్‌లో మాజీ సైనికుల సంక్షేమ సంఘం కార్యాలయం పక్కన మాజీ సైనికులకు ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం 15 సెంట్ల స్థలాన్ని ఇచ్చిందని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన ఈ స్థలంలో ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన నిధుల విడుదలకు సంబంధించిన కరస్పాండెన్స్ కూడా జరుగుతోందన్నారు. అయితే కొందరు వ్యక్తులు ఈ స్థలం తమదని ఒక న్యాయవాది ద్వారా అక్కడ బోర్డు కూడా పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత న్యాయవాదితో కూడా మాట్లాడామని, ఈ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్ చూపిస్తే బోర్డు తీసివేస్తామని ఆయన చెప్పారన్నారు. ఈ విషయాన్ని జిల్లా సైనిక సంక్షేమ అధికారి దృష్టికి తీసుకువెళ్లామని, అలాగే డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డికి కూడా తెలియజేశామన్నారు. ఈ స్థలాన్ని కాపాడుకునేందుకు అవసరమైతే జిల్లాలోని మాజీ సైనికులందరూ కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసేందుకు కూడా వెనుకాడబోమన్నారు.

కలెక్టరేట్‌లో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం మాయం

- సుందరీకరణ పనుల్లో తీసేసిన వైనం



సుందరీకరణ పనులకు ముందు ..



సుందరీకరణ పూర్తయిన తరువాత కనిపించని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో సతీసమేతంగా ఉన్న శ్రీకృష్ణదేవరాయల శిల్పం మాయమైంది. ఇటీవల కలెక్టరేట్ ముందు ఆధునీకరణ పనుల్లో భాగంగా ఆ పార్కులో చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఆ శిల్పాన్ని పక్కనబెట్టారు. ఆధునీకరణ పనులు పూర్తి కాగా.. నాలుగు సింహాల స్థూపాన్ని అందంగా తీర్చిదిద్దారు. అయితే పక్కన పెట్టిన రాయల వారి శిల్పాన్ని మాత్రం అక్కడ ప్రతిష్ఠించకుండా విస్మరించారు. అసలు ఆ శిల్పం ఉందా? లేక పనుల్లో భాగంగా ముక్కలైందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజా సంఘాల నాయకుల ఆగ్రహం

కలెక్టరేట్ ఆధునీకరణ పనుల్లో భాగంగా నాలుగు సింహాల స్థూపాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దారు. అయితే శ్రీకృష్ణదేవరాయలు చిన్నమ్మదేవి, తిరుమలదేవిలతో కూడిన శిల్పాన్ని ప్రతిష్ఠించకపోవడంపై ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు జరిగే సమయంలోనే శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అయినా పట్టించుకోకుండా పనులను పూర్తి చేయడంపై ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహంతో ఉన్నారు. రాయలసీమతో ఎంతో అనుబంధం ఉన్న శ్రీకృష్ణదేవరాయలు శిల్పాన్ని తిరిగి పెట్టకుండా విస్మరించడంపై బలిజ సంఘాల నేతలు పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

- డ్రైవర్లకు స్వల్ప గాయాలు
- సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు



దెబ్బతిన్న ట్రావెల్ బస్సు ముందు భాగం

ఓర్వకల్లు: కర్నూలు–కడప జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున నన్నూరు వద్ద ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు వేగంగా వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం, యనగండ్లకు చెందిన ట్రాక్టర్ బండల లోడ్‌తో కర్నూలు వెళ్లింది. బండలను అన్‌లోడ్ చేసి ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో నన్నూరు వద్దకు రాగానే..హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు వేగంగా ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ట్రాక్టర్ ఇంజిన్ భాగం ఏడమవైపు పడగా, ట్రాలీభాగం కుడివైపు పడింది. ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ భాస్కర్, క్లీనర్ మహేష్, బస్సు డ్రైవర్ కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో 35 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న రాత్రి గస్తీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గాయపడిన వారికి హైవే పెట్రోలింగ్ సిబ్బందితో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన జిల్లా జట్టు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో నంద్యాల జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ పోటీలకు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడా నైపుణ్యత చూపిన క్రీడాకారులను నాణ్యానిర్ణేతలు ఎంపిక చేశారు. ఈసందర్భంగా జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఎంపిక పోటీల్లో బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాబు, సురేష్, ట్రెజరర్ చంద్రారెడ్డి, శివారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ చేస్తుండగా.. చైన్ స్నాచింగ్

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– గుంజలపాడు ఆర్‌అండ్‌బీ రహదారిలో చైన్ స్నాచింగ్ జరిగింది. ఆదివారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. పట్టణంలోని సత్యసాయిబాబా ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న లక్ష్మికుమారి శనివారం సాయంత్రం ఇంటిపక్కన మహిళలతో వాకింగ్‌కు వెళ్లింది. మహిళలు వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని 50 సంవత్సరాల వయస్సు కలిగిన ఓ వ్యక్తి వారి వెనుకనే వాకింగ్ చేస్తున్నట్లు నటించి వారిని దాటే వెళ్లే సమయంలో లక్ష్మికుమారి మెడలో ఉన్న నల్లపూసలదండ, బంగారు గొలుసు లాక్కొని పరిగెత్తాడు. కొంతదూరంలో మరో వ్యక్తి బైక్ ఆపుకుని ఉండగా ఆ వ్యక్తి రాగానే బైక్ ఎక్కించుకుని ఇద్దరు అక్కడి నుంచి గుంజలపాడు గ్రామం వైపు పరారయ్యారు. దుండగులు మెడలో ఉన్న 25 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా బహిరంగ ప్రదేశాలకు వాకింగ్‌కు వెళ్లవద్దని సూచించారు. మహిళలతో కలిసికట్టుగా వెళ్లినా మెడలో బంగారు ఆభరణాలు ఉన్నట్లయితే ఆభరణాలు కన్పించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కొత్తకోటలో దొంగలు పడ్డారు

- తొమ్మిది ఇళ్లలో చోరీ



విచారణ చేస్తున్న సీఐ సీఎం రాకేష్

డోన్ టౌన్: కొత్తకోట గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు తొమ్మిది ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన రాముడు, సంజీవరాయుడు, దేవేంద్రుడు, బజారి, చెన్నయ్య, రామక్క, పరమేషు, లచ్చమ్మ, మల్లికార్జున ఇళ్లలో చోరీ జరిగింది. బాధితుల్లో ఐదుగురు మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో జరుగున్న పోలాల అమావాస్య పండుగ కోసం బంధువుల ఇళ్లకు వెళ్లారు. మరో ముగ్గురు ఇంటికి తాళం వేసి సమీపంలోని బంధువుల ఇళ్లలో నిద్రించగా, మరొకరు సొంత పనుల మీద మీద ఇంటికి వెళ్లారు. తాళం వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేసి ఉన్నదంతా దోచుకెళ్లారు. తొమ్మిది ఇళ్లలో దాదాపు 10 తులాల బంగారు ఆభరణాలు, రూ. లక్ష వరకు నగదు అపహరించినట్లు తెలుస్తోంది. దొంగలు కారులో వచ్చి ఊరి చివర ఉంచి గ్రామంలోకి వచ్చినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసు స్టేషన్ సీఐ సీఎం రాకేష్ ఆదివారం గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించి క్లూస్ టీంను రప్పించి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చోరీకి గురైన ఇంటి యజమానులు ఇంకా రాలేదని వారు వస్తే చోరీకి సంబంధించి పూర్తి సమాచారం తెలుస్తుందని తెలిపారు.

27 నుంచి గణపతి నవరాత్రులు



సాక్షిగణపతి స్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 5 వరకు గణపతి నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భగణపతికి, శ్రీశైలం సమీపంలోని సాక్షిగణపతికి, యాగశాలలో ఆశీనులను చేసిన గణపతిస్వామి పంచలోహ మూర్తికి వ్రతకల్ప విశేషార్చణలు చేస్తామన్నారు. సాక్షిగణపతి ఆలయం వద్ద మట్టి వినాయక విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేస్తామన్నారు. బుధవారం ఉదయం 9గంటలకు యాగశాల ప్రవేశంతో గణపతి నవరాత్రోత్సవాలను శ్రీకారం చుడతామన్నారు. 28 నుంచి సెప్టెంబర్ 4 వరకు ప్రతిరోజు విశేష పూజలతో పాటు గణపతిహోమం నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ గణపతిహోమం, జయాదిహోమం, పూర్ణాహుతి, కలశోద్వాసన, అవబృథం, మహాదాశీర్వచనం, తీర్థప్రసాద వితరణ నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థమై మృత్తికా గణపతికి వినాయకచవితి రోజున పరోక్షసేవకు రూ.1,116 సేవా రుసుముగా నిర్ణయించారు. సేవాకర్తలు శ్రీశైల టీ.వి, యూ ట్యూబ్ ద్వారా సేవను వీక్షించవచ్చు. భక్తులు ఈ పరోక్షసేవను సద్వినియోగం చేసుకోవాలని దేవస్థాన ఈఓ సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

బద్వేలు అర్బన్: చికిత్స నిమిత్తం చేరిన ఓ వ్యక్తి బద్వేల్ ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందినట్లు అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. బద్వేల్ ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రెండు రోజుల క్రితం అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ యువకుడిని 108 సహాయంతో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆసుపత్రిలో చేర్చిన సమయంలో తన పేరు బాషా అని, తన స్వగ్రామం చాగలమర్రి అని మాత్రమే తెలిపాడు. మృతుని బంధువులు ఎవరైనా గుర్తిస్తే అర్బన్ పోలీసులకు సంప్రదించాలని సీఐ కోరారు.

'దామోదరం' జిల్లాగా మార్చాలి

- పెద్దపాడులోని 'నీతిగృహ' ప్రాంగణంలో దీక్షలు



రిలే దీక్షల్లో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

కర్నూలు(అర్బన్): తొలి బహుజన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలనేది ప్రజల ఆకాంక్ష అని పలు సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. దామోదరం సంజీవయ్య స్వగ్రామమైన పెద్దపాడులోని ఆయన నివాసం ' నీతి గృహ ' ప్రాంగణంలో ఆదివారం రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ముందుగా పూలే, అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దామోదరం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దామోదరం రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షల్లో సాధన సమితి గౌరవాధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు, అధ్యక్షులు వాడాల త్యాగరాజు, ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు, సమితి ప్రధాన కార్యదర్శి డీ రామశేషయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ఏఐసీసీ అధ్యక్షులుగా అనేక ఉన్నతమైన పదవులను అలంకరించిన సంజీవయ్య ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా నీతి, నిజాయితీలకు మారుపేరుగా పాలన సాగించారన్నారు. కర్నూలు జిల్లాకు ఆయన పేరును పెట్టాలన్నారు. రాష్ట్రంలోని ఒంగోలు, నెల్లూరు, కృష్ణా, కోనసీమ, కడప జిల్లాలకు టంగుటూరి ప్రకాశం పంతులు, పొట్టి శ్రీరాములు, ఎన్‌టీఆర్, డా.బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ వైఎస్సార్ పేర్లను పెట్టి గౌరవించిన నేపథ్యంలో కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరును పెట్టి గౌరవించాలని కోరారు. దామోదరం సంజీవయ్య పేరును కర్నూలుకు పెట్టేంతవరకు వివిధ రూపాల్లో శాంతియుత ఉద్యమాలు చేస్తూనే ఉంటామన్నారు. ఆయా సంఘాల నాయకులు జేవీ క్రిష్ణయ్య, రాజీవ్ కుమార్, నాగభూషణం, పరమేశ్వరయ్య, కురువ అయ్యన్న, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామమూర్తి, మాల్గోవ సంయుక్త కార్యదర్శి ఓబులేసు, సురేష్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శివచతుస్సప్తాహ భజనలు



భజన ముగింపు సందర్భంగా స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా లోకకల్యాణం కోసం నిర్వహించిన శివచతుస్సప్తాహ భజనలు ముగిశాయి. గత నెల 25న ప్రారంభమైన అఖండ భజనలు ఆదివారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలోని వీరశిరోమండపంలో శ్రావణమాసమంతా నిరంతరంగా రేయింబవళ్లు అఖండ శివపంచాక్షరి నామ భజనలు నిర్వహించారు. ముగింపు పూజల్లో భాగంగా అర్చకులు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలను ముగించారు. కర్నూలు నగరానికి చెందిన అయిదు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన రెండు భజన బృందాలకు శివభజనలు చేయడానికి అవకాశం కల్పించారు.